
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
6-10-2026 (Tuesday)
MAIN EDITION

వాటర్ బిల్ అప్‌డేట్ పేరుతో సైబర్ మోసాలు




అక్షరటుడే, హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో వాటర్ బిల్ అప్‌డేట్ పేరుతో సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. జలమండలి పేరుతో లింక్‌లు పంపి వినియోగదారుల ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. ఈ క్రమంలో జల మండలి అధికారులు ప్రజలకు కీలక సూచనలు చేశారు. వాటర్ బిల్ అప్‌డేట్, బిల్లు బకాయి, కనెక్షన్ తొలగింపు తదితర పేర్లతో వినియోగదారులను సైబర్ నేరస్తులు మోసం చేస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి జలమండలి పేరు, వాటర్ బిల్ అప్‌డేట్ పేరుతో వచ్చే ఫోన్ కాల్స్, మెసెజ్‌లకు స్పందించవద్దని అధికారులు సూచించారు.

లక్నో ఎయిర్‌పోర్టు వద్ద భారీ అగ్నిప్రమాదం



అక్షరటుడే, యూపీ : లక్నోలోని చౌదరి చరణ్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయం వెలుపల మంగళవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనుల్లో పనిచేస్తున్న కార్మికుల కోసం ఏర్పాటు చేసిన మూడు అంతస్తుల తాత్కాలిక వసతి గృహంలో ఉదయం సుమారు 6:50 గంటలకు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సులభంగా మంటలంటుకునే పీవీసీ ప్యానెళ్లతో ఈ క్యాంప్‌ను నిర్మించడంతో.. అగ్నికీలలు నిమిషాల వ్యవధిలోనే మొత్తం భవనానికి వ్యాపించాయి.

రక్షణ రంగంలో చారిత్రక ఘట్టం



అక్షరటుడే, ఏపీ : ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వేదికగా రక్షణ రంగంలో మరో మైలురాయి నమోదైంది. విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో నిర్మించిన భారత నౌకాదళ తొలి స్వదేశీ ఫ్లీట్ సపోర్ట్ షిప్ 'సూర్య' జలప్రవేశం చేసింది. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

మేజర్లకు పూర్తి వ్యక్తిగత స్వేచ్ఛ: అలహాబాద్ హైకోర్టు



అక్షరటుడే, యూపీ : మేజరైన కుమార్తె తన ఇష్టానికి వ్యతిరేకంగా తల్లిదండ్రుల వద్దే ఉండాలని బలవంతం చేయడానికి 'హెబియస్ కార్పస్' పిటిషన్‌ను ఆశ్రయించలేరని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. 25 ఏళ్ల తన కుమార్తె పూజను కోర్టు ముందు హాజరుపరచాలని కోరుతూ ఆమె తల్లి కళావతి దేవి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ సందీప్ జైన్ ఈ తీర్పు వెలువరించారు.

కరెంట్ బిల్లుల పెంపుపై హరీశ్‌రావు ఆగ్రహం



అక్షరటుడే, హైదరాబాద్: కరెంట్ బిల్లుల పెంపుపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పండుగల సమయంలో ఏ ప్రభుత్వమైనా శుభవార్తలు చెబుతాయి, కానీ కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దసరా, దీపావళి పండు గల ముందు ప్రజలకు షాకిచ్చిందన్నా రు. కరెంటు బిల్లుల రూపంలో ఏకంగా రూ. 5,420 కోట్లు ప్రజల నుంచి వసూలు చేయాలని నిర్ణయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి



అక్షరటుడే, మెదక్ : లంచం తీసుకుంటూ ఓ పంచాయతీ కార్యదర్శి ఏసీబీకి చిక్కారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లాలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి బి. అరుణ గ్రామంలోని ఓ వ్యక్తి రెండు ఇళ్లకు చెందిన మ్యుటేషన్ దరఖాస్తును ప్రాసెస్ చేసి పై అధికారులకు పంపడానికి రూ.20 వేల లంచం డిమాండ్ చేశారు. అనంతరం ఆ మొత్తాన్ని రూ.15 వేలకు తగ్గించారు. కారోబార్ దాసరి సంతోష్ సాయంతో లంచం తీసుకుంటుండగా ఆమెను అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఏటీఎంలో భారీ చోరీ



అక్షరటుడే, రంగారెడ్డి : రాజేంద్రనగర్ పరిధిలోని శతంరాయిలోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. ఏటీఎం కేంద్రంలోకి చొరబడ్డ దొంగలు గ్యాస్ కట్టర్లతో ఏటీఎంను తెరిచారు. అందులోని సుమారు రూ. 32 లక్షల నగదుతో పరారయ్యారు. సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని నిందితుల కోసం గాలిస్తున్నారు.



ఢిల్లీలో ఉద్రిక్తత నెలకొంది. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్ష ఎంపీలు చేపట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం రాహుల్ గాంధీతో పాటు పలువురు ఎంపీలను అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో ఎంపీలు, పోలీసులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. - అక్షరటుడే, నేషనల్ డెస్క్

ఢిల్లీలో హైటెన్షన్

- విపక్ష ఎంపీల భారీ నిరసన ర్యాలీ
- అడ్డుకున్న పోలీసులు
- బారికేడ్లు ఎక్కిన రాహుల్ గాంధీ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్

ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని ఇండియా కూటమి ఎంపీలు మంగళవారం ఉదయం పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ర్యాలీగా బయలుదేరారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఎంపీలు రోడ్డుపై ధర్నాకు దిగారు. పోలీసులు బారికేడ్లు అడ్డుపెట్టగా రాహుల్ గాంధీ వాటిపైకి ఎక్కి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు ఆయనతో పలువురు ఎంపీలు, నాయకులను అరెస్ట్ చేశారు. బస్సులలో అక్కడి నుంచి తరలించారు.

బస్సులో నుంచి దూకి..

రాహుల్ గాంధీ అకస్మాత్తుగా వాటిలో బారికేడ్ పైకి ఎక్కి జాతీయ జెండాను ఊపారు. ఆయనకు మద్దతుగా ఇండియా కూటమి ఎంపీలు నినాదాలు చేశారు. సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీని పోలీసులు బస్సులో తీసుకెళ్లారు. అయితే ఆ ఇద్దరు బస్సు నుంచి దూకి ఎన్నికల సంఘం భవనం వైపు వెళ్లారు. అనంతరం వారిని మళ్లీ అదుపులోకి తీసుకున్నారు.

ఇంటర్నెట్ బంద్

ఎంపీల ర్యాలీతో పోలీసులు అలర్ట్ అయ్యారు. ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. పార్లమెంట్ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం వరకు భారీగా బలగాలను మోహరించారు. సెంట్రల్ ఢిల్లీకి వెళ్లే మార్గాలను మూసివేశారు. మరోవైపు ఈ ర్యాలీకి డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ దూరంగా ఉండటం గమనార్హం.

దేశవ్యాప్తంగా 6 స్థానాలకు ఉప ఎన్నికలు



అక్షరటుడే, నేషనల్ డెస్క్: దేశంలోని నాలుగు రాష్ట్రాల్లో ఖాళీ అయిన ఐదు అసెంబ్లీ స్థానాలతో పాటు ఒక లోక్‌సభ స్థానానికి ఉపఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. తమిళనాడులోని మదురాంతకం, ధారాపురం, పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, రేజినగర్, పుదుచ్చేరిలోని తట్టాంచావడి అసెంబ్లీ స్థానాలతో పాటు, అసోంలోని నాగావ్ లోక్‌సభ స్థానానికి ఇవాళ పోలింగ్ జరుగుతోంది. గత సాధారణ ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజాప్రతినిధులు వేర్వేరు నియోజకవర్గాల నుంచి పోటీ చేసి గెలవడం వల్ల ఖాళీ అయిన స్థానాలకు ఎన్నికల సంఘం ఈ బైపోల్స్ నిర్వహిస్తోంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఈ పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనుంది.

కాళేశ్వరం నీళ్లు ఏవి : కవిత



అక్షరటుడే, సిరిసిల్ల: వేములవాడ రాజన్నను టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత దర్శించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణంలో కాంక్రీట్‌కు బదులుగా కృష్ణశిలను ఉపయోగించాలని సూచించారు. రాజన్న ఆలయంలో కోడెలు మృతి చెందుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి బండి సంజయ్ పట్టించుకోవడం లేదని ఆమె మండిపడ్డారు. వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాలకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా చుక్క నీరు కూడా రాలేదన్నారు. రుద్రంగి వద్ద రూ.200 కోట్లతో 2.5 టీఎంసీల రిజర్వాయర్ నిర్మిస్తామన్న హామీని నెరవేర్చాలని కోరారు. రైతులకు నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. మాజీ మావోయిస్టులు తమ పార్టీలోకి రావాలని ఆమె ఆహ్వానించారు.

రష్యా దాడిలో భారత నావికుడికి గాయాలు



అక్షరటుడే, నేషనల్ డెస్క్: నల్ల సముద్రంలో నౌకపై రష్యా డ్రోన్ దాడి చేసింది. ఈ ఘటనలో ఇద్దరు సిబ్బంది మరణించగా, ఒక భారతీయుడితో సహా మరికొందరు గాయపడ్డారు. నల్ల సముద్రంలో ఎంవి రోయాద్ మమ్మడోవ్ అనే వాణిజ్య నౌకపై మంగళవారం తెల్లవారుజామున దాడి జరిగింది. రొమేనియా సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సిబ్బందిలో ముగ్గురు భారతీయులు ఉండగా.. ఒకరికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులు రొమేనియాలో చికిత్స పొందుతున్నారు.

ముస్లిం ఓటర్లను తొలగించే కుట్ర : ఒవైసీ



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : ముస్లిం ఓటర్లను తొలగించడానికి ఫారం 7 దుర్వినియోగం జరుగుతోందని అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. గోషామహల్ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా నుంచి ముస్లిం ఓటర్ల పేర్లను తొలగించేందుకు ఫారం 7 దరఖాస్తులు పంపారని అన్నారు. ఒక బీజేపీ మద్దతుదారుడు వీటిని దాఖలు చేశారన్నారు. ఆ ఓటర్లలో కొందరి పేర్లు ఇప్పటికే 2002, 2026 ఓటర్ల జాబితాలలో, ముసాయిదా ఓటర్ల జాబితాలో ఉన్నాయని, అందువల్ల వారిని తొలగించాలన్న అభ్యర్థనలు అనుమానాస్పదంగా ఉన్నాయని పేర్కొన్నారు. తప్పుడు ఫారం 7 దరఖాస్తులు సమర్పించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బర్డ్ ఫ్లూ కలకలం..



అక్షరటుడే, ఏపీ : ఆంధ్రప్రదేశ్‌లోని అనంతరపురంలో బర్డ్ ఫ్లూ కలకలం రేపింది. ఓ పౌల్ట్రీ ఫామ్‌లో 2,500 కోళ్లు మృతి చెందాయి. బుక్కరాయసముద్రం మండలం పరిధిలోని సిద్ధరాంపురం గ్రామంలో ఇటీవల ఏర్పాటు చేసిన ఫారానికి ఆదిలాబాద్ నుంచి కోళ్లను తీసుకొచ్చారు. దీంతో కొన్ని కోళ్లు మృతి చెందాయి. అనంతరం భారీ సంఖ్యలో కోళ్లు చనిపోవడంతో రైతు ఆందోళన చెందాడు. అధికారులు నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపగా.. బర్డ్ ఫ్లూగా నిర్ధారణ అయింది. మూడు నెలల పాటు గ్రామంలోకి కోళ్ల రాకపోకలను నిషేధిస్తామని అధికారులు తెలిపారు.

చెన్నై పోర్టులో భారీగా టపాసుల సీజ్



అక్షరటుడే, తమిళనాడు : చెన్నై పోర్టులో భారీగా చైనా బాణాసంచాను డీఆర్ఐ అధికారులు సీజ్ చేశారు. వీటిని అక్రమంగా చైనా నుంచి దిగుమతి చేసుకున్నట్లు గుర్తించారు. దీపావళీ వేడుకలకు ముందు పెద్ద ఎత్తున క్రాకర్స్‌ను చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో చెన్నై పోర్టులో నిఘా పెంచారు. ఈ క్రమంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తీసుకొచ్చిన టపాసులను సీజ్ చేశారు. స్టేషనరీ, మెడికల్ గ్లౌజులు, ప్లాస్టిక్ వస్తువులు, గృహోపకరణాలు వంటి సరుకుల పేరుతో వీటిని దిగుమతి చేసుకున్నారు. కంటైనర్లలో ముందు ఆ సామగ్రి పెట్టి వెనుకాల దాచి ఉంచిన బాణసంచాను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన బాణాసంచా విలువ రూ.12 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు.